సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం : 7 : మే : 2024



గులాబీ జెండా ఎగురవేయాలి

లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి ఖిలాపై గులాబీ జెండా ఎగురవేయాలని గొంగిడి సునీత పిలుపునిచ్చారు. - IIIలో



పేదల సంక్షేమమే ధ్యేయం

పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - IIIలో

గరిష్టం / కనిష్టం
42° / 27°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి



సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

చౌటుప్పల్ : ధాన్యం కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) బెన్‌షాలోమ్ ఆదేశించారు. సోమవారం చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమై ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. అకాల వర్షాలు పడుతున్నందున రైతులు నష్టపోకుండా త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేయాని సూచించారు. కాంటా వేసిన వడ్లను ఎప్పటికప్పుడు దిగుమతి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరికృష్ణ, పీఏసీఎస్ సీఈఓ ఎరుకల రమేష్, సివిల్ సప్లై అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

9న యాదగిరిగుట్టకు కేటీఆర్ రాక

యాదగిరిగుట్ట : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 9న యాదగిరిగుట్టకు రానున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, యాదగిరిగుట్ట పట్టణ ప్రధాన కార్యదర్శి పాపట్ల నరహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు మద్దతుగా నిర్వహించే బైక్ ర్యాలీలో కేటీఆర్ పాల్గొంటారని, అనంతరం కార్నర్ మీటింగ్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. కేటీఆర్‌తో పాటు ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

లడ్డూ నాణ్యత, సైజులో తేడా రావద్దు



చిరుధాన్యాలతో తయారు చేసిన లడ్డూను పరిశీలిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు స్వచ్ఛమైన లడ్డూలు అందజేయాలని దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు అక్కడి బాధ్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఆలయ సన్నిధిలో ఉన్న లడ్డూ తయారీ విభాగాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. లడ్డూ తయారీ నాణ్యత, పరిమాణం(సైజు)పై సెక్షన్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. లడ్డూ తయారీలో పరిమాణం, నాణ్యతలో ప్రమాణాలు పాటించాలని, తేడా రావద్దని సూచించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన లడ్డూను తిని రుచి చూశారు. అనంతరం టిక్కెట్ కౌంటర్‌కు వెళ్లి పరిశీలించారు.

పెద్దకందుకూరు రైల్వే గేట్ మూసివేత

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని పెద్దకందుకూరు రైల్వే గేట్‌ను నేటి నుంచి మూడు రోజుల పాటు మూసివేయనున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గేట్‌కు మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 35, కిమీ 254/2022 గేట్‌ను మంగళవారం నుంచి 9వ తేదీ వరకు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. గేట్ గుండా రాకపోకలు సాగించే వివిధ గ్రామాల ప్రజలు, వాహనదారులు గమనించి వేరే మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

శివుడికి అభిషేకం, అర్చనలు



స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై ప్రధానాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర కైంకర్యాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు నిజాభిషేకం, అర్చన, నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహహోమం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ, తిరువీధుల్లో ఊరేగించారు.

గంపగుత్తగా రాబట్టాలని..

సామాజికవర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో పార్టీలు

- ఆశీర్వాద సభలు, ఆత్మీయ సమ్మేళనాలు
- యువజన సంఘాలతోనూ ప్రత్యేక సమావేశాలు
- హామీలు గుప్పిస్తున్న అభ్యర్థులు

సాక్షి, యాదాద్రి : పోలింగ్ తేదీ సమీపించే కొద్దీ అభ్యర్థులు ఓట్ల వేటను ముమ్మరం చేశారు. ప్రధానంగా గంపగుత్తగా ఓట్లు సాధించే అంశాలపై దృష్టి సారించారు. అందులో భాగంగా సామాజిక వర్గాలతో పాటు యువజన సంఘాల మద్దతు కూడగట్టేందుకు ఆశీర్వాద సభలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఆయా సంఘాలకు హామీలు గుప్పించడంతో పాటు బేరసారాలు నెరుపుతున్నట్లు తెలుస్తోంది.

ముఖ్య నాయకులకు సమ్మేళనాల బాధ్యతలు

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రధాన రాజకీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు పెద్ద ఎత్తున ఆశీర్వాద సభలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నాయి. గౌడ, గొల్లకుర్మ, పద్మశాలి, ముదిరాజ్, విశ్వకర్మలు, రజకులు, మున్నూరు కాపు.. ఇలా అన్ని బీసీ వర్గాలతో పాటు దళిత సంఘాలతో మున్సిపల్, మండల, గ్రామ స్థాయిలో సమ్మేళనాలు నిర్వహిస్తున్నాయి. ఈ సభలకు ఆయా సంఘాలకు చెందిన జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను ఆహ్వానిస్తున్నారు. ఆర్యవైశ్యులు, రెడ్డి కుల సంఘాల నేతలను సైతం ప్రత్యేకంగా కలిసి మద్దతు కూడగట్టే ప్రయత్నం అభ్యర్థులు చేస్తున్నారు. తమ పార్టీల విధి విధానాలు, గతంలో ప్రజలకు చేసిన పనులు, సేవా కార్యక్రమాలు, గెలుపొందితే చేయాలనుకుంటున్న పనులను వివరిస్తున్నారు. ఇదే అదనుగా కుల సంఘాల నేతలు తమ సమస్యలను అభ్యర్థుల ముందుంచి హామీలు పొందుతున్నారు.



భువనగిరిలో ఇటీవల ఆర్యవైశ్యుల సమ్మేళనంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి చామల

సమ్మేళనాలకు అధిక ప్రాధాన్యం

ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓ వైపు బహిరంగ ప్రచారం నిర్వహిస్తూనే మరో వైపు ఆశీర్వాద సభలు, ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొంటున్నారు. ప్రచారం ముగింపునకు మరో ఐదు రోజులే సమయం ఉండడంతో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసే పరిస్థితి లేదు. ఈ క్రమంలో కుల సంఘాలతో ఏర్పాటు చేస్తున్న సమావేశాలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. తమ ప్రభుత్వాలు కుల సంఘాలకు చేసిన పనులు, వారితో పార్టీకి ఉన్న అనుబంధం మొదలైన అంశాలను వివరిస్తూ ఓట్లను ఆకర్షించే యత్నం చేస్తున్నారు.

బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. కాగా ఆత్మీయ సమ్మేళనాల బాధ్యతలను ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, కుల సంఘాలకు ప్రాతినిధ్యం వహించే నాయకులు చూస్తున్నారు.

బలనిరూపణలో కుల సంఘాల నేతలు

ప్రధాన రాజకీయ పార్టీలకు మద్దతు ప్రకటించిన కుల సంఘాల పెద్దలు.. ఆశీర్వాద సభలు, ఆత్మీయ సమ్మేళనాలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు తమ బలం, బలగం ఏమేరకు ఉందో నిరూపించుకుంటున్నారు. ఇందుకోసం ప్రతి గ్రామం నుంచి సమ్మేళనాలకు పెద్ద సంఖ్యలో తమ సామాజికవర్గం వ్యక్తులను తరలిస్తున్నారు. వారికి రవాణా, భోజన వసతులు సంఘం నాయకులే చూస్తున్నారు. ప్రతి పార్టీ రోజూ కనీసం రెండు చోట్ల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నాయి.

యువజన సంఘాలతోనూ..

యువజన సంఘాలతోనూ ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యేకంగా సమావేశం అవుతూ మద్దతు కోరుతున్నాయి. వారి డిమాండ్లు నెరవేర్చేందుకు హామీలిస్తున్నాయి. అంతేకాకుండా ముందుగానే బేరసారాలు కుదర్చుకుంటున్నట్లు తెలుస్తోంది.



భువనగిరిలో గిరిజన మోర్చా సమ్మేళనంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్



పోచంపల్లిలో జరిగిన చేనేత సమ్మేళనంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్, నాయకులు



చౌటుప్పల్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న జేపీ నడ్డా, ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, కాసం వెంకటేశ్వర్లు, పాశం భాస్కర్, గూడూరు నారాయణరెడ్డి తదితరులు

కమలం పార్టీలో జోష్..

- చౌటుప్పల్ బీజేపీ సభకు భారీగా తరలివచ్చిన శ్రేణులు
- ఉత్సాహం నింపిన జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రసంగం

చౌటుప్పల్ : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చౌటుప్పల్ పరిధి తంగడపల్లిలోని ముస్కు మధుసూధన్‌రెడ్డి వ్యాయామ కళాశాల క్రీడా ప్రాంగణంలో చౌటుప్పల్ జనసభ పేరిట సోమవారం నిర్వహించిన బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపీ నడ్డా ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల తీరును విమర్శిస్తూ జెపీ నడ్డా ప్రసంగిస్తుండగా జనం నుంచి చప్పట్లు మార్మోగాయి. హిందీలో ప్రసంగించినా జనం చక్కగా అర్థం చేసుకొని నడ్డాకు మరింత ఉత్సాహం ఇచ్చారు.

కాషాయమయం

సభకు జనం భారీగా రావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ప్రధాన రహదారులతోపాటు సభా ప్రాంగణం కాషాయమయంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. డీసీపీ రాజేష్‌చంద్ర సభ ముగిసే వరకు అక్కడే ఉన్నారు. ఏసీపీ పటోళ్ల మధుసూధన్‌రెడ్డి పర్యవేక్షించారు. జేపీ నడ్డాకు బూర నర్సయ్యగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు స్వాగతం పలికారు. కళాకారులు ఆటపాటలు ఆకట్టుకున్నాయి.

అబద్ధాలతో పాలన సాగిస్తున్నారు : కాసం

కాంగ్రెస ప్రభుత్వం అబద్ధాలు చెబుతూ పాలన సాగిస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశం విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలకు పంగనామాలు పెట్టిందన్నారు. భూ భకాసురుడు, బ్రోకర్ అయిన రేవంత్‌రెడ్డిని తరిమికొట్టి ప్రజలంతా బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, పార్లమెంట్ ప్రభారీ పాపారావు, కన్వీనర్ బందారపు లింగస్వామి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, యాదాద్రి, జనగామ, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు పాశం భాస్కర్, జశ్వంత్‌రెడ్డి, బొక్క నర్సింహారెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, దోనూరి వీరారెడ్డి, కర్నాటి ధనుంజయ్య, దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా కార్యదర్శులు ఆలె చిరంజీవి, బత్తుల జంగయ్య, అధికార ప్రతినిధి కైరంకొండ అశోక్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, మున్సిపల్, మండల పార్టీ అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన జనం

నడ్డాతో ముచ్చటిస్తున్న 'బూర'

ఏపీ రద్దు కావు..

ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లు మారుస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఏపీ రద్దు కావని, సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ భవిష్యత్ మాత్రం రద్దవుతుందన్నారు. రాహుల్‌గాంధీ పరిస్థితి కూడా అదేనని, అందుకే వారికి భయం పట్టుకుందన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడితే గాడిద గుడ్డు అంటూ విమర్శలు చేస్తున్నాడని, గాడిదలు గుడ్డు పెట్టవన్న విషయం తెలుసుకోవాలని హితవు పలికారు. మూడేళ్ల పాటు పదవిలో ఉందామనుకున్న రేవంత్‌రెడ్డికి ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎవరికీ తెలియదని, అతనో డమ్మీ అని విమర్శించారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎంపీగా, ఎమ్మెల్సీగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసి ఏం సాధించావని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు రూ.9వేల కోట్లు తీసుకువచ్చి అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. నా తర్వాత ఎంపీలుగా పనిచేసిన వ్యక్తులు ఏం చేశారు, ఎన్ని నిధులు తెచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

పెయిడ్ ఆర్టికల్స్‌ను పరిశీలించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరిటౌన్ : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారం అయ్యే రాజకీయ పార్టీల ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను నిశితంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కే.జెండగే సూచించారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. ఓటర్లపై ప్రభావితం చేసే వార్తల విషయంలో అప్రమతంగా ఉండాలని, ప్రింట్, ఎలక్ట్రానిక్, లోకల్ కేబుల్ చానళ్లు, సోషల్ మీడియా, వాట్సప్, ఈ పేపర్లను నిత్యం మానిటరింగ్ చేయాలని కోరారు. అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేస్తే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లి నోటీసు జారీ చేయాలన్నారు. ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను పరిశీలించడంతో పాటు వాటికి అయ్యే ఖర్చు నివేదికలను వ్యయ పరిశీలకులకు పంపించాలని పేర్కొన్నారు. సమావేశంలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ సెక్రెటరీ, జిల్లా సంబంధాల అధికారి వెంకటేశ్వర్‌రావు, సోషల్ మీడియా నోడల్ అధికారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి సాహితీ, మానిటరింగ్ కమిటీ సభ్యులు జి.దయాకర్, కె.శ్రీనివాస్, శ్రవణ్, పాల్గొన్నారు.



మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పరిశీలన

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరిలో గల విద్యాజ్యోతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆలేరు నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే సందర్శించారు. ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2,653 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదైనట్లు తెలిపారు.

ఆగని భగభగలు

- మర్యాలలో 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు

భువనగిరిటౌన్ : జిల్లాలో భానుడి భగభగలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం అత్యధికంగా బొమ్మలరామారం మండలం మర్యాలలో 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. యాదగిరిగుట్ట 44.4, రాజాపేట 44, భువనగిరి 43.1, ఆత్మకూర్ (ఎం) 42.7, చౌటుప్పల్ 42.6, బీబీనగర్ 42.3, అడ్డగూడూరు 42.1, మోత్కూరు 42, వలిగొండ 41.9, ఆలేరు మండలంలో 41.6 డిగ్రీల ఎండ కాసింది. ఉదయం 8 గంటలకే మొదలైన ఎండ తీవ్రత సాయంత్రం 5 గంటల వరకూ తగ్గలేదు. ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో వాతావరణం చల్లబడి జనాలకు ఉపశమనం లభించింది. సోమవారం మళ్లీ మళ్లీ ఎండతీవ్రత పెరడడం, దీనికి ఉక్కపోత తోడవడంతో అల్లాడిపోయారు. సాయంత్రం వరకు ఇళ్లకే పరిమితమయ్యారు.

భువనగిరి స్థానాన్ని గెలిచితీరాలి



కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : భువనగిరి లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుని తీరాలని, అందుకు పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండల పరిధిలోని ఆరెగూడెం తాజా మాజీ సర్పంచ్ మునగాల ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బూత్‌ల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, ఆరు గ్యారంటీలను వివరించి ఓట్లు రాబట్టాలని కోరారు. అదే విధంగా గుండ్లబావి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు పిశాటి శ్రీకాంత్‌రెడ్డి తన అనుచరులతో కలసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, నాయకులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న రాయగిరిలో బీజేపీ బహిరంగ సభ

- హాజరుకానున్న కేంద్ర మంత్రి అమిత్‌షా

భువనగిరి : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 9న భువనగిరి మున్సిపాలిటీ పరిధి రాయగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ తెలిపారు. ఈ సభకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరుకానున్నారని పేర్కొన్నారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి సభాస్థలిని ఆయన సందర్శించారు. ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపును కాంక్షిస్తూ నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలిరావాలనికోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా, ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

హాజీపూర్ బ్రిడ్జి అంతేనా..?

- 2020–21లో రూ.6.31 కోట్లు మంజూరు
- మూడు సంవత్సరాల తర్వాత జనవరిలో శంకుస్థాపన
- నేటికీ పుట్టింగ్‌లకే పరిమితం
- వర్షాలు కురిస్తే రాకపోకలు బంద్

బొమ్మలరామారం : బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగిస్తామని నాయకులు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చడం లేదు. బొమ్మలరామారం మండల పరిధిలోని హాజీపూర్ - మాచన్‌పల్లి గ్రామాల మధ్య గల షామీర్‌పేట్ వాగుపై వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సగం గ్రామాల ప్రజలు బొమ్మలరామారం రావాలన్నా, జిల్లాకేంద్రానికి వెళ్లాలన్నా వాగు దాటాల్సి ఉంటుంది. వర్షం పడితే రాకపోకలు సాగవు. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ప్రజల విన్నపం మేరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా 2020–21 సంవత్సరంలో రూ.6.32 కోట్లు మంజూరు కాగా.. మూడేళ్ల తరువాత పనులకు శంకుస్థాపన చేసి వదిలేశారు.





షామీర్‌పేట వాగులో వంతెన కోసం నిర్మించిన పుట్టింగ్‌లు, పుట్టింగ్‌ల కోసం తీసిన గోతుల్లో నిలిచి నీరు

శంకుస్థాపన చేసిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి వంతెన నిర్మాణానికి మూడు నెలల క్రితం జనవరి 4వ తేదీన రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలసి శంకుస్థాపన చేశారు.నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు పనులను వేగవంతం చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలోనే వంతెన పనులు పూర్తై తమ కష్టాలు తీరుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది.

గుంతలు తవ్వి వదిలేశారు

వంతెన నిర్మాణం కోసం వాగులో కొన్నిచోట్ల పుట్టింగ్‌లు నిర్మించారు. మరికొన్ని చోట్ల పుట్టింగ్‌ల కోసం గోతులు తీసి వదిలేశారు. బ్రిడ్జి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ తీరు వల్ల పనుల్లో జాప్యం జరుగుతుందన్న విమర్శలున్నాయి.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



బ్రిడ్జి నిర్మాణం కోసం షామీర్‌పేట వాగుపై గల చెక్ డ్యాంలో నిల్వ ఉన్న నీటిని సైతం రైతులు తొలగించారు. వాగు పరిసర ప్రాంత రైతులు సుమారు 30 ఎకరాలకు పైగా వరి పైరును త్యాగం చేసినా ఫలితం లేకుండా పోయింది. వర్షాలు వస్తే పనులకు ఆటంకం కలుగుతుంది. అధికారులు బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసేదిశగా చర్యలు తీసుకోవాలి.

–ఫక్కీరు రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ, నాగినేనిపల్లి

ప్రమాదాల బారిన పడుతున్నాం



పుట్టింగ్‌ల కోసం తీసిన గోతులు ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలం వస్తే పనులకు ఆటంకం కలుగుతుంది. ఈలోపే వాగులో పనులను పూర్తి చేయాలి. అలాగే తిర్మలగిరి ఎక్స్ రోడ్డు నుంచి మాచన్‌పల్లి బస్టాండ్ వరకు బీటీ రోడ్డు పనులు సాగడం లేదు. కంకర పరిచి వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

–దాసరి జంగారెడ్డి, హాజీపూర్

కాంట్రాక్టర్‌కు నోటీస్ ఇచ్చాం

హాజీపూర్ వంతెన నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ సమకూర్చుకోవడంలో జాప్యం జరిగిందని, వారం రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని కాంట్రాక్టర్ సంజాయిషీ ఇచ్చారు. మరోసారి కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

–వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ డీఈఈ

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

రూ.10లక్షల నగదు స్వాధీనం

● భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర

భువనగిరి క్రైం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సోమవారం పోలీసులు తనిఖీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా రూ.10,09,480 నగదు స్వాధీనం చేసుకున్నట్లు భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇద్దరిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి సోమవారం వరకు 4,189.81 లీటర్ల మద్యం, రూ.1,22,50,030 నగదు, 5.91 కిలోల గంజాయి, 53 జిలిటెన్ స్టిక్స్, 6925 కేజీల ఐరియల్ బూస్టర్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు 658 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 14 లైసెన్స్ గన్‌లను డిపాజిట్ చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు.


రాజేశ్ చంద్ర, డీసీపీ

313 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు

● నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు నల్ల గొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడు కంపెనీల కేంద్ర బలగాలు, 2600 మంది జిల్లా సిబ్బందితో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నల్ల గొండ జిల్లా వ్యాప్తంగా 1677 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిలో 313 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని అన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో గట్టి నిఘా పెట్టడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద ఏడు కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్


పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసిన ఉపాధ్యాయ దంపతులు

నల్లగొండ: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సోమవారం కూడా కొనసాగింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ కళాశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడికి ఎన్నికల సిబ్బంది పెద్ద సంఖ్యలో రావడంతో ఓటు వేసేందుకు వారు దాదాపు గంట సమయం లైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. ఎండాకాలం కావడం, ఓటు వేసేందుకు ఎక్కువ సమయం పట్టడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు.

'పోస్టల్ బ్యాలెట్' ను సద్వినియోగం చేసుకోవాలి


ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సూర్యాపేటటౌన్: ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంక సూచించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 8వ తేదీ వరకు ఈ కేంద్రాలు ఉంటాయన్నారు. ఇప్పటి వరకు 1,435 మంది ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎంపీఓ గోపి పాల్గొన్నారు.

వైఎస్సార్ శిష్యులం.. మాటిస్తే తప్పం

- 'కారు' షెడ్డుకు పోయింది.. కేసీఆర్ దవాఖానాకు పోయిండు
- కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులను జైలుకు పంపిస్తాం
- భువనగిరిలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమైంది
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


కార్నర్ మీటింగ్‌కు హాజరైన కార్యకర్తలు, ప్రజలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

యాదగిరిగుట్ట: 'మేము వైఎస్సార్ శిష్యులం.. మాట ఇస్తే తప్పం' అని కాంగ్రెస్ పార్టీ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట చౌరస్తాలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో కారు షెడ్డుకు పోయిందని.. కేసీఆర్ దవాఖానాకు పోయిండని అన్నారు. భువనగిరిలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు సరైన అభ్యర్థులు లేరని విమర్శించారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా విజయం సాధించడం ఖాయమన్నారు. త్వరలోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావును జైలుకు పంపిస్తానన్నారు. ఇప్పటికే కేసీఆర్ కూతురు కవిత తీహార్ జైలుకు వెళ్లిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన అందిస్తుందన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆలేరు నియోజకవర్గం నుంచి చామలకు భారీ మెజార్టీని అందించాలని కోరారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించేందుకు గ్రామాల్లో ప్రజలు ముందుకు వస్తున్నారని అన్నారు. గత పాలకులు రాష్ట్రంలోని ప్రజలను ఆగం చేశారన్నారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు, ప్రజల దీవెనలు తనపై ఉన్నాయన్నారు. తనను గెలిపిస్తే భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్నర్ మీటింగ్‌లో టీపీసీసీ రాష్ట్ర నాయకుడు జనగాం ఉపేందర్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు కానుగు బాలరాజు, బందారపు భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ జిల్లా కేంద్రంలోని అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన జనసభలో అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ నేతలు


నల్లగొండలో జేపీ నడ్డాకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు


చౌటుప్పల్‌లో నిర్వహించిన జనసభలో మాట్లాడుతున్న జేపీ నడ్డా, పక్కన ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య

గెలుపు 'చెయ్యి'కి చిక్కాలి



భువనగిరి పట్టణంలో సోమవారం నిర్వహించిన మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి చేపను బహూకరిస్తున్న తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మత్స్యకారులు.

– భువనగిరిటౌన్

పారదర్శకంగా ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ

● సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకటరావు


ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్. వెంకటరావు

సూర్యాపేట : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల కమిషనింగ్ (బ్యాలెట్ పేపర్ అనుసంధానం) ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంల కమిషనింగ్, మాక్‌పోల్ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవీఎంల కమిషనింగ్, మాక్‌పోల్ ప్రక్రియను అప్రమత్తంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ వేణుమాధవ్, తహసీల్దార్లు శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య, మహేందర్‌రెడ్డి, ఎన్నికల ట్రైనర్లు, సిబ్బంది, అధికారులు ఉన్నారు.

'మిర్యాల'లో పూర్తయిన ప్రక్రియ

మిర్యాలగూడ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈవీఎం, వీవీ ప్యాట్‌ల కమిషనింగ్ ప్రక్రియ సోమవారం పూర్తయిందని ఆర్డీఓ, రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లను స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి సీల్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు హరిబాబు, శ్రీనివాస్‌శర్మ, జవహర్‌లాల్, సురేష్, డీఏ బాలాజీనాయక్, ఆర్ఐలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో వలంటీర్లు

● ఒక్కో పోలింగ్ బూత్‌కు ముగ్గురు చొప్పున నియామకం


చిలుకూరు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణకు హాజరైన వలంటీర్లు

చిలుకూరు: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలీసులు, పోలింగ్ అధికారులకు సహాయ సహకారాలు అందించేందుకు ఎన్నికల కమిషన్ పోలింగ్ బూత్‌ల వద్ద వలంటీర్లను నియమించింది. పోలీస్ సిబ్బంది కొరత వలన ఒక్కో బూత్ వద్ద ఒకే ఒక్క పోలీసును బందోబస్తుగా ఉంచుతున్నారు. దీని వలన ఇబ్బందులు ఎదురవ్వకుండా అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బందిని పోలింగ్ కేంద్రాల వలంటీర్లుగా నియమించారు. ఒక్కో బూత్‌కు ముగ్గురు వలంటీర్లను నియమించారు. వీరికి మండలాల వారీగా శిక్షణ ఇస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని ఆయా మండలాల్లో మరో రెండు రోజుల్లో శిక్షణ పూర్తికానుంది. పోలింగ్ రోజున వీరికి డ్రెస్ కోడ్ కూడా ఇచ్చే ఆలోచన ఉన్నట్లుగా తెలిసింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఐదో రోజు 13 మంది నామినేషన్లు

నల్లగొండ: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి సోమవారం ఐదో రోజు 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నుంచి ముంద్ర మల్లికార్జునరావు, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బరిగల దుర్గాప్రసాద్, నేషనల్ నవక్రాంతి పార్టీ నుంచి కర్ని రవితో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా పులిపాక సుజాత, చీదల్ల వెంకట సాంబశివరావు, చీదల్ల ఉమామహేశ్వరి, తాడిశెట్టి క్రాంతి కుమార్, అయితగోని రాఘవేంద్ర, బక్క జడ్సన్, బుగ్గ శ్రీకాంత్, పాలకూరి అశోక్ కుమార్, దేశగాని సాంబశివరావు నామినేషన్లు వేశారు. వీరంతా తమ నామినేషన్ పత్రాలను నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్. మహేందర్‌కు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


నడ్డి శ్రీను (ఫైల్)

గుర్రంపోడు: మండలంలోని మొసంగి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ బి. శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మొసంగి గ్రామానికి చెందిన నడ్డి శ్రీను(40)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడు గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన శీలం సైదాబాబు, చల్లా శంకర్ అతడిని వర్షం వచ్చేలా ఉందని మిరపకాయలపై పట్టా కప్పేందుకు తీసుకొని వెళ్లారు. రాత్రి సైదాబాబు, శంకర్‌లు ఇంటికి వచ్చి నిద్రించగా.. నడ్డి శ్రీను ఇంటికి రాలేదు. సోమవారం గ్రామానికి చెందిన నడ్డి సైదయ్య అనే రైతు తన పొలం వద్దకు వెళ్తుండగా గ్రామ శివారులోని ముత్యాలమ్మ గుడి ముందు నడ్డి శ్రీను మృతిచెంది ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చాడు. కాగా తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని, విచారణ జరిపి శీలం సైదాబాబు, చల్లా శంకర్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీను భార్య నడ్డి రమణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతుడి శరీరం ఎడమ వైపు కాలిపోయి ఉందని, మిగతా ఇద్దరు పిడుగుపాటు వల్ల తాము స్పృహ కోల్పోయామని, స్పృహలోకి వచ్చిన తర్వాత ఇంటికి చేరుకున్నామని చెబుతున్నారని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న చాడ రవి

నల్లగొండ: టెట్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు ఆటంకంగా ఉన్న టెట్‌పై ఎన్సీటీఈ వివరణ తీసుకోవాలని కోరారు. ఎన్నికలు ముగిసేలోగా ఎన్సీటీఈ నుంచి వివరణ తీసుకుని, ఎన్నికలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నలప రాజు వెంకన్న, మురళయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ఎరనాగుల సైదులు, రాజశేఖర్, రమణ, ప్రభాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గీతకార్మికుడు మృతి


ఉషయ్య (ఫైల్)

కనగల్ : పిడుగుపాటుకు గురై కల్లు గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన కనగల్ మండల పరిధిలోని జి.యడవల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి ఉషయ్య (59) రోజువారీ మాదిరిగా సాయంత్రం సమయంలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీసి కిందకు దిగే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో చెట్టుపై పిడుగు పడడంతో ఉషయ్య చెట్టుపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. ఉషయ్య కుమారుడు గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

భువనగిరి క్రైమ్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ సోమవారం మృతి చెందింది. వివరాలు.. హైదరాబాద్‌లోని ధూల్‌పేటకు చెందిన రాజు తన బంధువు అనుబాయితో ఈ నెల 3న భువనగిరి పట్టణ సమీపంలోని స్వర్ణగిరికి బైక్‌పై వచ్చాడు. రేణుక గుడి వద్ద యూటర్న్ తీసుకుంటుండగా బైక్ అదుపుతప్పి కిందపడడంతో అనుబాయి(35)కి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను వెంటనే భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ కృష్ణస్వామి తెలిపారు.

చేతబడి నెపంతో వృద్ధురాలి హత్య


అలివేలమ్మ మృతదేహం

నడిగూడెం : వృద్ధురాలు హత్యకు గురైన సంఘటన అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ జి.అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురవరం గ్రామానికి చెందిన కొమ్ము అలివేలమ్మ (70) ఉదయం పదిన్నర గంటల సమయంలో ఇంటి ఆవరణలో ఒంటరిగా ఉంది. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు అలివేలమ్మ మెడకు తాడుతో ఉరి బిగించి హత్య చేశారు. ఆమె మనవడు సాయికృష్ణ ఇంటికి వచ్చి చూసేసరికి అలివేలమ్మ మృతి చెంది ఉంది. మృతురాలికి ఒక కొడుకు ఉన్నాడు. తన నాయనమ్మ అలివేలమ్మ చేతబడి చేస్తోందనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన హుస్సేన్, మరో వ్యక్తి కలిసి హత్య చేశారని మృతురాలి మనవడు సాయికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాయికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలివేలమ్మ మృతదేహానికి కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

ఈదురు గాలికి చెట్టుకూలి ఒకరికి తీవ్ర గాయాలు

నార్కట్‌పల్లి: అకాల వర్షం.. ఈదురు గాలులకు చెట్టు కూలడంతో ఇంటి రేకులు పగిలి రేకుల కింద ఉన్న ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలో ప్రభుత్వ హైస్కూల్ సమీపాన కొండ గోపాల్‌గౌడ్ ఆదివారం తన రేకుల ఇంటిలో కూర్చున్నాడు. ఆ సమయంలో వీచిన ఈదురు గాలికి ఇంటి ఆవరణలో గల చెట్టు ఒక్కసారిగా కూలి రేకులపై పడడంతో రేకుల కిందనే ఉన్న గోపాల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి, కుటుంబ సభ్యులు అతడిని తక్షణమే స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

వాహనాల తనిఖీల్లో రూ.3.20 లక్షలు పట్టివేత

నార్కట్‌పల్లి : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో సోమవారం వాహనాలను తనిఖీ చేయగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.3.20 లక్షలను పట్టుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. నగదును సీజ్ చేసి జిల్లా కేంద్రంలోని ట్రెజరీ కార్యాలయంలో అప్పగించామని పేర్కొన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- వ్యవసాయ బావిలో దూకిన మహిళ
- బయటకు తీసి సీపీఆర్ చేసిన అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు
- చికిత్స పొందుతూ మృతి
- యాదగిరిపల్లిలో ఘటన


నాగమణి (ఫైల్)

యాదగిరిగుట్ట: వరకట్న వేధింపులకు ఓ వివాహిత బలైంది. ఈ ఘటన యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లిలో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిపల్లికి చెందిన బూడిద యాదయ్య– దేవమ్మ కూతురు నాగమణి (25) వివాహం జనగామ జిల్లా నాగారం గ్రామానికి చెందిన గడిపే ప్రవీణ్‌తో 2020 మార్చి 18న జరిగింది. ప్రవీణ్ నాగారంలో ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. నాగమణి– ప్రవీణ్ దంపతులకు ఇద్దరు పిల్లలు పుట్టారు. భర్త ప్రవీణ్, మామ సాయిలు, అత్త జానమ్మ కొన్నేళ్లుగా నాగమణిని మానసికంగా వేధించడంతోపాటు వరకట్నం కావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయాన్ని నాగమణి తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు నాగారం వెళ్లి పంచాయితీ సైతం పెట్టారు. అయినా భర్త, అత్త, మామల్లో మార్పు రాకపోగా వరకట్నం కోసం మరింత వేధించసాగారు. ఇటీవల నాగారంలో నాగమణిని భర్తతోపాటు అత్త, మామలు కొట్టి, తీవ్రంగా వేధించారు. దీంతో నాగారంలోని అత్తగారి ఇంటి నుంచి నాగమణి, ఇద్దరు పిల్లలను ఆమె తల్లిదండ్రులు గత శుక్రవారం యాదగిరిపల్లికి తీసుకువచ్చారు. ఇక్కడికి వచ్చాక కూడా భర్త ప్రవీణ్ తరచూ ఫోన్ చేసి ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో నాగమణి తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో యాదగిరిపల్లిలో ఇంటి వద్ద ఉన్న వ్యవసాయబావిలో దూకింది. అదే సమయంలో యాదగిరిపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు బావిలో నాగమణి దూకిన విషయాన్ని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ ప్రభాకర్, డ్రైవర్ శంకర్ బావిలోకి దిగి నాగమణిని బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న నాగమణికి సీపీఆర్ చేశారు. అనంతరం ఆమెను ప్రైవేట్ వాహనంలో యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో భువనగిరి జిల్లా కేంద్రం ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ వైద్య పరీక్షలు జరిపిన వైద్యులు నాగమణి మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ వెల్లడించారు. మృతురాలికి మూడేళ్ల కుమారుడు, తొమ్మిది నెలల పాప ఉందని సీఐ పేర్కొన్నారు.

నీటి కాలువలో పడి వ్యక్తి మృతి

డిండి: ప్రమాదవశాత్తు నీటి కాలువలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం డిండి మండలంలోని ఎర్రారం గ్రామ సమీపంలో జరిగింది. వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన మోనేష్(34) తమ బంధువులు డిండి మండలంలోని ఎర్రారం సమీపంలో గల ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన శుభకార్యానికి హాజరయ్యాడు. ఈ క్రమంలో ఫంక్షన్‌హాల్ పక్క నుంచే వెళ్తున్న డిండి ప్రాజెక్టు కాలువలో ప్రమాదవశాత్తు అతడు పడిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి మోనేష్‌ను కాలువలోంచి బయటకు తీయగా.. అప్పటికే అతడు మృతిచెందాడు. కాగా ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాజు తెలిపారు.

● సువాసనల నీడలో సేదదీరుతూ..


మల్లె చెట్టు పందిరిలో సేదదీరుతున్న మేకల జనార్దన్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : వేసవిలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఎండ వేడిమి నుంచి తట్టుకోవడానికి ప్రజలు ఇళ్లలో ఏసీలు, కూలర్లు ఏర్పాటు చేసి ఉపశమనం పొందుతున్నారు. అయితే భూదాన్‌పోచంపల్లిలో 13వ వార్డుకు చెందిన మేకల జనార్దన్‌రెడ్డి కుటుంబం మాత్రం చెట్ల చల్లటి నీడలో సేదదీరుతున్నారు. జనార్దన్‌రెడ్డి ఆరేళ్ల క్రితం ఇంటి ఆవరణలో తీగమల్లి, జాజిమల్లి, బొండు మల్లి అనే మూడు తీగ జాతి మల్లె మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి పెరిగి తీగంతా విస్తరించి పచ్చటి పందిరి అల్లుకుంది. అంతే కాక మల్లె పూలు విరబూసి సువాసనలు వెదజల్లుతున్నాయి. దాంతో జనార్దన్‌రెడ్డి కుటుంబం పగలంతా సువాసనలు వెదజల్లే చల్లటి నీడలో హాయిగా సేదదీరుతున్నారు.